కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా. 11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 37, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 65, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10-12, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

21, 22 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు పోటీలు

సనత్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, కార్యదర్శి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇండోర్ గేమ్స్ అయిన క్యారమ్స్, చెస్, జనరల్ నాలెడ్జ్ పోటీలు, సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ (లేడీస్ అండ్ జంట్స్), బ్రిస్క్ వాకింగ్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 89779 14856 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రైల్వే స్టేషన్లో సంక్రాంతి రద్దీ



బ్యాగులు సోదా చేస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ పెరిగింది. ప్లాట్ ఫామ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండుగ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు వెళ్లే వారు మూడు, నాలుగు రోజుల నుంచి రైల్వే స్టేషన్‌కు తరలివస్తున్నారు. ఈ క్రమంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్‌లోని ప్రవేశద్వారాలు, వెయిటింగ్ హాళ్ల వద్ద పకడ్బందీగా భద్రత కల్పించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికులు బ్యాగుల సోదాలు చేశారు. రైల్వే స్టేషన్ బయట, పరిసర ప్రాంతాల్లోని బస్టాండుల్లో నార్త్‌జోన్ లా అండ్ ఆర్డర్ పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

రాంగోపాల్‌పేట్: సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య మెమోరియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంటుంది. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా తీర్చిదిదిన బొమ్మలు అందరిని ఆకర్షిస్తున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్త ఝాన్సీ, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు



పద్మారావునగర్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఫ్లోరా హోటల్ వద్ద కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, నాయకులు వేదప్రకాశ్, సీపీ శంకర్, శ్యామ్‌రావు, నిరంజన్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



ముగ్గులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: ప్రాచీనమైన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భవన్‌లో జరిగిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొద్ది సంవత్సరాల నుంచి వీటిని నిర్వహించడం ఎంతైనా అభినందనీయం అన్నారు. సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంతటా సంక్రాంతి జోష్



రవీంద్రనగర్‌నగర్‌కాలనీలో సంక్రాంతి సంబరాలు..



సనత్‌నగర్: అంతటా సంక్రాంతి జోష్ మొదలైంది. పల్లె సంస్కృతికి అద్దంపడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం నాటి భోగి పండుగ ఏర్పాట్లలో జనం బిజీబిజీగా మునిగిపోయారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన కాలనీల్లోని అపార్ట్‌మెంట్‌వాసులంతా ఒకచోట చేరి భోగి పండ్లు పోసే కార్యక్రమాలను నిర్వహించుకునే సంస్కృతి నగరంలో ప్రతియేటా విస్తరిస్తోంది. ఇక ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలు ఉంచి పూలతో అలంకరించడం సంప్రదాయతకు పెట్టింది పేరు. సంక్రాంతి పండుగ ప్రవేశం సందర్భంగా ఆదివారం అమీర్‌పేట్‌లోని వస్త్ర వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. చిన్నారుల గాలిపటాల ఫైటింగ్‌లో కేరింతలు కొడుతూ సందడిని షురూ చేశారు. ఇందులో మేము సైతం అంటూ పెద్దలు కూడా చేరిపోతున్నారు. ఈ నేపథ్యంలో గాలిపటాల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి నెలకొంది. మొత్తం మీద ఎటుచూసినా సంక్రాంతి శోభ అలుముకుంది. పండుగ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గోదా, రంగనాథుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో మంగళవారం గోదా, రంగనాధుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే సంజీవరెడ్డినగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం, బల్కంపేట్ రేణుకా ఎల్లమ్మ , ఈఎస్ఐ చౌరస్తాలోని విజయలక్ష్మీదేవాలయం తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.



మనవళ్లు, మనువరాళ్లతో గాలిపటాలు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు..

సనత్‌నగర్: సనత్‌నగర్ రవీంద్రనగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రంగోలీ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో తమలోని సృజనను వెలికితీశారు. న్యాయనిర్ణేతలుగా పార్వతి, పద్మావతి, రామిరెడ్డి, సత్యనారాయణ, మురళీధర్‌లు వ్యవహరించారు.

పతంగులు ఎగురవేసిన ఎమ్మెల్యే

నిత్యం వివిధ కార్యక్రమాలతో బిజీగా ఉండే మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన మనువళ్లు, మనువరాళ్లతో ఉల్లాసంగా గడిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఉన్నత విద్యమండలి వైస్ ఛైర్మన్ ప్రొ.పురుషోత్తానికి వినతి పత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం నాయకులు డా.విజయేందర్ రెడ్డి, డా.ఉపేందర్ పేర్కొన్నారు. యూజీసీ పే స్కేల్స్‌ను అమలు పరిచిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. బేసిక్ పే, డీఏ, హెచ్‌ఆర్‌సీ, 3 శాతం వార్షిక వేతనాన్ని చెల్లించాలని వీసీలతో పాటు ఉన్నత విద్యమండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, విద్య కమీసన్ ఛైర్మన్, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు.

'లక్ష డప్పులు- వేల గొంతుకల'కు డీజేఎఫ్ మద్దతు

కంటోన్మెంట్: ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును, ప్రతి ఒక్కరు స్వాగతించాలని, దళిత జర్నలిస్ట్ ఫోరం (డీజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల ఎల్లేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దొమ్మాటి శివకుమార్, రాష్ట్ర నాయకులు రాములు అన్నారు. లక్ష డప్పులు వేల గొంతుకల సమావేశానికి దళిత జర్నలిస్ట్ ఫోరం సంపూర్ణంగా మద్దతిస్తుందని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ ఆదేశాల మేరకు బోయిన్‌పల్లిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ వార్త రాములు మాట్లాడుతూ... ఎస్సీలంటే కేవలం మాదిగ, మాలలు మాత్రమే కాదని, 59 కులాలు అన్నారు. దళిత జర్నలిస్ట్ ఫోరం గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షులు బాబురావు, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిలు సాగర్, రఘురాజు, కార్యవర్గ సభ్యులు మూర్తి, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కంటోన్మెంట్: పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ గౌడ్ ఆదివారం గౌడకంఠమ్ జాతీయ మాస పత్రిక కేలెండరును ఆవిష్కరించారు. హిమాయత్‌నగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు మోతె చక్రవర్తి గౌడ్ , కాంగ్రెస్ ముఖ్య నాయకులు అద్దంకి దయాకర్ , జెఎస్‌ఆర్ గ్రూప్ సన్ సిటీ అధినేత డా. జడపల్లి నారాయణ గౌడ్, ఆర్టీసీ రిటైర్డ్ కంట్రోలర్ నోముల స్వామి గౌడ్, గౌడకంఠమ్ జాతీయ మాస పత్రిక ఎడిటర్ నోముల సిద్ధూ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి, యువ గర్జన సభను విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గర్జన సభ కరపత్రాన్ని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డా.పిడమర్తి రవి, విద్య కమిషన్ సభ్యులు డా.చారుగొండ వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ డా.చరణ్‌కౌశిక్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.వంరగల్ రవి, ఓయూ జేఏసీ ఛైర్మన్ డా.నంద్రు నర్సింహ మాదిగ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

గొప్ప సమాజ సేవకుడు సుబ్రమణ్యం

లాలాపేట: రెండు తెలుగు రాష్ట్రాల్లోని కమ్మ సంఘాలను ఏకం చేస్తూ పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిన మన్నె సుబ్రమణ్యం గొప్ప సమాజ సేవకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు కొనియాడారు. ఇటీవల గుండెపోటుతో అకాల మరణం పొందిన మన్నె సుబ్రమణ్యం సంస్మరణ సభను ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో నిర్వహించారు. ఎంతో మందికి వ్యక్తిగతంగా విద్యా, ఉద్యోగ అవకాశాలు, అర్థిక సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. సుబ్రమణ్యం ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

వైదిక ఆశ్రమ గురుకుల పరిరక్షణకు మహాధర్నా

సనత్‌నగర్: వైదిక ఆశ్రమ కన్యా గురుకులాన్ని రక్షించాలని గురుకుల పరిరక్షణ సమితి ప్రతినిధుల మహాధర్నా చేపట్టారు. ఆదివారం తెలంగాణ, ఆంధ్ర ఆర్య సమాజం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కుందన్‌బాగ్‌లోని బేగంపేటలో గల గురుకులం వద్ద నిరసన చేపట్టి గురుకులానికి సంబంధించిన 4.5 ఎకరాల భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. సమాజ్ ప్రతినిధి విఠల్ రావు ఏకపక్ష నిర్ణయం వలన బిల్డర్లతో ఒప్పందం చేసుకొని పవిత్ర కన్యాగురుకుల స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని ధ్వజమెత్తారు. స్వామిధర్మానాంద, భరత ముని, డాక్టర్.ధర్మతేజ, ధర్మపాల్, మర్రికృష్ణారెడ్డి, నరేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకా.. అంతలోనే వెళ్లిపోతివా..!



దినేశ్వర్ భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

- కుమారుడి మృతదేహం వద్ద విలపించిన తల్లి
- అశ్రునయనాలమధ్య దినేశ్వర్ అంత్యక్రియలు

బన్సీలాల్‌పేట్: కొండపోచమ్మ డ్యామ్‌లో మునిగిపోయి మృతిచెందిన దినేశ్వర్ అంత్యక్రియలు ఆదివారం బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో నిర్వహించారు. దీంతో చాచానెహ్రూనగర్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి.స్థానికులు ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు తరలి వచ్చి దినేశ్వర్ భౌతికకాయంపై పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు. కుమారుడి పార్థివదేహంపై పడి తల్లి సుమలత విలపించిన తీరు చూపరుల కంటతడి పెట్టించింది. బాగా చదువుకొని కుటుంబానికి ఆసరాగా ఉంటావనుకుంటే కొడుకా.. అంతలోనే అందని లోకాలకు వెళ్లావంటూ తల్లి విలపించిన తీరు అక్కడున్న వారి హృదయాలను కదిలించింది. దినేశ్వర్ అంతిమయాత్ర చాచానెహ్రూనగర్ నుంచి బయలుదేరి వివిధ ప్రాంతాల గుండా బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికకు చేరుకుంది.

ప్రముఖుల పరామర్శ..

బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో ఉంచిన దినేశ్వర్ భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, జి. పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్, వెంకటేశన్ రాజు తదితరులు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు



రాంగోపాల్‌పేట్: చిత్రలేఖనం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందని వాల్‌హార్ట్స్ పెయింటింగ్, డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ బొబ్బిలి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సంస్థ ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ల్యాండ్ స్కేప్, కైట్ ఫెస్టివల్ థీమ్‌లపై డ్రాయింగ్, పెయింటింగ్‌ల చిత్రాలను గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పెయింటింగ్స్‌తో విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడతాయని అన్నారు.

ముగ్గుల పోటీలు సంక్రాంతికి ప్రత్యేకం



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, సంతోష్ యాదవ్ తదితరులు



రంగవల్లికలు తీర్చిదిద్దుతున్న అమరావతి విద్యార్థినులు

కంటోన్మెంట్: ఘనమైన మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యతపై మనందరిపైనా ఉందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ మాజీ ఛైర్మన్ సంతోష్ యాదవ్- లక్ష్మీప్రియ దంపతుల ఆధ్వర్యంలో మారేడుపల్లిలోని షెనాయ్ గ్రౌండ్‌లో భారీ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆయా ముగ్గులను పరిశీలించి, పాల్గొన్న వారిని ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

అమరావతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

చిలకలగూడ: అమరావతి టాలెంట్ స్కూలులో సంక్రాంతి సంబరాలు ఆదివారం సందడిగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు విభిన్నమైన రీతుల్లో తీర్చిదిద్దిన రంగవల్లికలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, అధ్యాపకులు పతంగులు ఎగురవేసి, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు చండీ హోమం

సనత్‌నగర్: పుష్యమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని కొలువుదీరిన శ్రీదుర్గామాత అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీదత్తాత్రేయ స్వామి వారికి అభిషేకం, దత్తహోమం జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు శ్రీగిరి ఆలయంలో గోదా కల్యాణం



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 9 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్‌లు తెలిపారు. పాంచరాత్ర ఆగమ పద్ధతిలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 14వ తేదిన మకర సంక్రమణ పూజ, శాత్తుమొర, తీర్థప్రసాదగోష్ఠి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పతంగులు ఎగరేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

డీఈ బ్రహ్మానందం

పద్మారావునగర్: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగరేసే యువకులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సికింద్రాబాద్ డీఈ బ్రహ్మానందం ఆదివారం పేర్కొన్నారు. పతంగులు ఎగురవేసే సమయంలో విద్యుత్తు లైన్లతో జాగ్రత్తగా, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని కోరారు. భవనాల పై నుంచి పతంగులు ఎగరేసే వాళ్లు హైటెన్షన్ వైర్లు, విద్యుత్తు లైన్లను గమనించాలన్నారు. సాధ్యమైనంత వరకు బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగుర వేయాలని విజ్ఞప్తి చేశారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ 'ఏ' క్యాబిన్ దగ్గర ఆదివారం మధ్యాహ్నం ఔరంగాబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సుమారు 40-45 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



లింగరాజు (ఫైల్)

లాలాపేట: మతిస్థిమితం లేని వ్యక్తి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తిరుమలగిరి ప్రాంతం చంద్రగిరి కాలనీకి చెందిన లింగరాజు(58)కు కొంత కాలంగా మతిస్థిమితి సరిగ్గా లేదు. ఈయన కొన్ని నెలల నుంచి హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లో ఉన్న గాయత్రి సేవా సంస్థకు వెళుతున్నాడు.ఈ క్రమంలో ఈనెల 3న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంతకి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పద్మారావునగర్: స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ నవ సమాజ నిర్మాణం దిశగా కదలాలని వక్తలు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం పద్మారావునగర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖర రెడ్డి, మర్రి పురురవరెడ్డి, రామంచ మహేష్, హరినాథ్ నాయి, మాజీ కార్పొరేటర్ మంత్రి కళావతి తదితరులు మాట్లాడారు.

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో ఆయన విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ ఆదివారం నివాళులర్పించారు. యువత ఆయన చూపిన మార్గంలో నడిచి దేశ ప్రతిష్టను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

రాంగోపాల్‌పేట్: ఆవులమందలో స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యక్షులు దయానంద్‌రావు, ప్రతినిధులు శ్రీరాములు, పట్టెం కిరణ్ పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలను ఆచరిద్దాం

సనత్‌నగర్: స్వామి వివేకానంద బోధనలు యావత్ భారతావనికి చైతన్య దీపికలని పలువురు వక్తలు కొనియాడారు. యోగ, వేదాంత శాస్త్రాలను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు.

- సనత్‌నగర్‌లో బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ చైతన్య, చారి, రవిచంద్ర, శ్రీకాంత్‌యాదవ్, మురళి, సీపీ శ్రీనివాస్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

- బీకేగూడ జైభారతి స్కూల్ చౌరస్తాలో జరిగిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, దయానంద్, క్రాంతికుమార్, ఆకుల మహేష్, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆవులమందలో వివేకానందుడికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న రవిప్రసాద్‌గౌడ్



స్వామి వివేకానందకు నివాళులు అర్పిస్తున్న వెల్లాల రామ్మోహన్